## కథ

# ఆట

**- పి.ఎస్.నారాయణ**

ఎన్నికల పండగొచ్చేసింది.

కన్నారావుకు ఎక్కడ ఎంతున్నదో కూడా తెలియనంత ఆస్తి వుంది. తమది జమీందారీల కుటుంబమని అతడు మీసాలు మెలేస్తూ, రచ్చబండ దగ్గర పాలేరు తెచ్చి వేసిన డిజైన్ కుర్చీలో కూర్చుని, కనబడ్డ ప్రతివాడికీ, ప్రతి రోజూ చెప్తుకుంటుంటాడు. ఎన్నికల్లో గెలిచి తన ప్రజలకు సేవ చేయాలనేది అతడి మాటల్లో ఎప్పుడూ దొర్లుతుంటుంది. కానీ, తన ఆస్తంతా అన్యాక్రాంతమై పోకుండా వుండాలంటే చేతిలో ఏదో ఒక పదవి వుండాలనేది అతడి అంతరంగపు కోరిక.




బావమరిదిని పిలిచి సలహా అడిగాడు.

"నిలబడేయ్!" అన్నాడు.

"ఎంత ఖర్చవుతుందంటావ్ మరి బామ్మర్దీ?"

"పిండి కొద్దీ రొట్టె..గెలవాలనుకుంటే యాభై దాకా పెట్టాలి"

"అమ్మో! వేలా..లక్షలా?"

"వేలకేమౌతుంది బావా బోడివేలు. ఒక పని చేయ్! నీకా మన ఊళ్ళో చాలా మంచి పేరుంది. ఒకళ్ళ జోలికి పోవని, ఒకళ్ళది ఆశించవనీను. నాకా అటు రూలింగ్ పార్టీలోనూ, ఇటు అపొజిషన్ పార్టీలోనూ తెలిసిన వాళ్ళు చాలామంది వున్నారు. వాళ్ళెవరన్నా టిక్కెట్టు ఇస్తే అంత ఖర్చుండదు. పైగా వాళ్ళే కొంత పార్టీ ఫండు నుంచి మన ఖర్చులకి ఇస్తారు. అటు పబ్లిసిటీ వుంటుంది. రాయేసి చూడమంటావా?" అన్నాడు.

"బాబ్బాబ్బాబు.." అన్నాడు తనకంటే చిన్నవాడయినా బావమరిది చేతులు పట్టుకుంటూ.

అతడి ఆలోచన అతడిది. ఎలాగైనా ఈ దెబ్బతో బావనుంచి కాస్తో కూస్తో దండుకోవాలని.

అయితే వాళ్ళనుకున్నట్లు ఏ పార్టీ టిక్కెట్టివ్వ లేదు. "మా వాళ్ళల్లోనే హేమాహేమీలున్నారు. ఎవరికివ్వాలా అని తలకాయలు పగలకొట్టుకు ఛస్తున్నాం" అన్నారు.

"ఇండిపెండెంట్‌గా నిలబడి, వాళ్ళందరికీ నీ శక్తేమిటో రుజువు చేసేయ్' అన్నాడు నిప్పొరిపోకుండా కట్టెలు ఎగదోస్తూ బావమరిది. "పోతేపోయింది.. పేరయినా మిగుల్తుంది. ఊరికి దూరంగా వున్న ఆ పదెకరాలు అమ్మేసేయ్" అన్నాడు. "ఎట్లాగో దాన్ని పక్క ఊరివాళ్ళు మింగేసేలా వుంటున్నారంటుంటివిగా!"

"సరే కానీయ్!" అన్నాడు కన్నారావు. అతడినీ ఎలక్షన్ జ్వరం వళ్ళంతా పట్టేసింది.

* * *

పొలం అమ్మేశారు. బొమ్మ గీయించి ఎలక్షన్ గుర్తుగా పెట్టించేసుకుని జెండాలు, బ్యానర్లు తయారు చేయించారు. నామినేషన్ వేసేశారు. ఎలక్షన్లయ్యేంతవరకూ జీపులూ, కార్లు అద్దెకు తీసుకున్నారు. ప్రచారం మొదలెట్టేశారు.

మంచి రోజు చూసి మొదటి మీటింగు పెట్టి మైకు వెనకాల నిలబడ్డాడు కన్నారావు. "మాది జమీందారి కుటుంబం. మాకు వందెకరాల పొలం వుంది" ఆయన నోరు తెరవగానే లాల్చీ పట్టుకు గుంజాడు వెనగ్గా నిల్చున్న బావమరిది."నేను చాలా బీదవాడిని, మీలో ఒకడిని, మీ కష్టాలన్నీ నావే. మీరే నేను..నేనే మీరు- అని చెప్పు" అని చెవిలో గొణిగాడు.

మొదటిరోజు అనుభవంతో, రెండు రాత్రిళ్ళు ఇంట్లో కూర్చోపెట్టి, బాగా స్టేజీ మీద మాట్లాడగలిగిన ఓ పెద్దాయన్ను పట్టుకొచ్చి క్లాసులు తీసుకున్నారు.

పొద్దున్నే లేవటం. ఊళ్ళో జనాన్ని పోగేసుకుని జీపుల్లో, కార్లలో పక్క ఊళ్ళ మీద పడటం. కాస్త ముక్కు, మొఖం తెలిసిన వాడు కనబడితే తన వేపే పని చేస్తానని ఒట్లు గూడా వేయించుకున్నారు. వాళ్ళ జేబుల్లో కొన్ని నోట్లు కుక్కారు. ప్రచారంలో అవసరానికుంటయి వుంచండి అంటూ.

ఇంటింటికీ తిరిగారు. ఆడవాళ్ళు ఆడవాళ్ళకు బొట్లు పెట్టారు. మగవాళ్ళు మగవాళ్ళ గడ్డాలు పట్టుకున్నారు. మన సారు గెలిచారూ అంటే మన ఊళ్ళ దశే తిరిగిపోతుందని హామీ ఇచ్చారు.

ఇంటికో బోరు వేయించి నీటి ఎద్దడే లేకుండా చేస్తామని చెప్పారు. ఇళ్ళు లేని వాళ్ళకు ఇళ్ళు కట్టిస్తామన్నారు. ఊరుకో కాలేజీ, హాస్పిటల్‌కూ ఎలక్షన్ల ముందే శంకుస్థాపనలు చేసేస్తాం అన్నారు.

చిరిగి మాసిన గుడ్డల్లో, చీమిడి కారుస్తున్న పిల్లల్నీ ఎత్తుకుని, చాక్లెట్లు కొనుక్కోమని చేతుల్లో నోట్లు పెట్టారు. తిరగని ఊరు లేదు. ఆగని ఇల్లు లేదు. కలవని మనిషి లేడు. ఖర్చుకు వెనక్కు చూసుకోవడమే లేదు. పదిహేను రోజుల్లోనే వంద కేజీల కన్నారావ్ ఎనభై కేజీలయ్యాడు.

ఎక్కడ ఎవరు ఏం పెట్టినా, వాళ్ళతో పాటే కూర్చుని తింటూనే వున్నాడు. అయినా నీరసించి పోయాడు.

ఓ రోజు రాత్రి పదకొండు గంటలప్పుడు కారులో నుంచి వేలాడిపోతూ దిగి ఇంట్లోకి వస్తూనే, "బామ్మర్దీ! నేనింత కష్టపడుతున్నానే, నువ్వు మరీ మరీ చెప్పావని ఆ చీమిడి ముక్కు పిల్లలందరినీ ఎత్తుకుని నా చొక్కాలని ఖరాబు చేసుకుంటున్నానే, జిడ్డు కారే మనుషులను కాగిలించుకుంటూ చెమట కంపుల్ని భరిస్తున్నానే, మన డబ్బులు తింటున్న ఈ వెధవలంతా మనకే ఓట్లేస్తారంటావా?" అన్నాడు నీరసంగా.

శ్రీకృష్ణ పరమాత్మ కురుక్షేత్రంలో అర్జునుణ్ణి చూసినట్లుగా చూశాడు కన్నారావుని బావమరిది.

"ఇది ఒక ఆటలాంటిది బావా. ఆడిన వాళ్ళంతా గెలవలేరు కదా. మనం ఇప్పుడు ఇంకా మొదటి మెట్టు మీదే వున్నాం. ఈ ఆటకి ఎంతో అనుభవం కావాలి. దీంతో అది మనకొచ్చేస్తుంది. చకాచకా మెట్లెక్కుకుంటూ వెళ్తూ వుండాలి. మనకూ ఓ రోజంటూ వుంటుంది. దాని కోసమే ఎదురుచూడాలి. మనం అప్పటివరకూ పెట్టిన ఖర్చంతా విజయం సాధించిన మెట్టు మీద కూర్చుని పూడ్చుకోవాలి"

కన్నారావు బావమరిది మాటల్ని బిక్కమొఖమేసుకుని వింటున్నాడు.

"నీకో ఆరుగురు పనీపాటాలేని వెధవలున్నారు. వాళ్ళకో ఆరుగురు పెళ్ళాలున్నారు. ముగ్గురు కూతుళ్ళున్నారు. వాళ్ళకు మొగుళ్ళున్నారు. వాళ్ళందరికీ హోల్ మొత్తంగా ఓటు హక్కున్న ఓ పదిహేను మంది దాకా మనవళ్ళు, మనవరాళ్ళు వున్నారు. ఇక పోతే నేనున్నాను. మా అక్కయ్యున్నది. నేను, మా అక్కయ్య తప్పా మిగతా వాళ్ళంతా లక్షలకు లక్షలు నీ డబ్బును మెక్కుతున్న వాళ్ళే. వీళ్ళు గాక నీ బంధువులు, స్నేహితులు నీ దగ్గర కాస్తో కూస్తో నంజిన వాళ్ళే. వాళ్ళంతా నీకు ఓటేస్తారో లేదో ముందు నువ్వు చూసుకో. ఇపుడు నువ్వు డబ్బులలిచ్చానంటున్నావే బోడి వందా, యాభై..వాళ్ళ సంగతి నేను చూసుకుంటాను. వాళ్ళెంత మాట మీద నిలబడేవాళ్ళో నేను చూపిస్తాను" అన్నాడు బామ్మర్ది చిద్విలాసంగా నవ్వుతూ.

ఇప్పటికే బావను ఊబిలో గొంతు వరకూ దింపేశాడు. ఇక తనకు ఆయన గెలిచినా లాభమే.. ఓడినా లాభమే!

★